# ఒక్కగానొక్క వారసుడు

జి.టి.ఎమ్. కృష్ణమాచార్యులు



"నమస్కారం..."

"నమస్తే!"

"ఖులాసాగా వున్నారా?"

"ఆహా! మరి మీరు?"

"మీ దయవల్ల! ఏమిటీ మధ్య కొత్తిగా దర్శనాల్లేవ్?"

"ఆహా! మీరు మహా 'ధర్మ దర్శనం' యిచ్చేస్తున్నట్లు!!"

"కాక నా దర్శనానికి మూల్యం వుందనా?"

"ఎంతమాట! దేముడి దర్శనం ఏ రూపంలోనయినా, ఎక్కడయినా, ఎలాగయినా వుండేది. మరి మీ దర్శనం-"

"దొరకదు. నిజమే! నా కోసం ఓ 'క్యూ' పాపులర్ అవలేదుగా. ఇక నా స్థానంకి స్థిరత్వమేది? తమ విషయంలో అలాగ కాదు!"

"అంటే...?"

"మీరు ఒకే ఒకచోట కొన్ని గంటలపాటు... ఒకోసారి రోజుల తరబడి 'వెలసి' వుంటారు. అక్కడ 'క్యూ' కు అర్థం వుందీ - పరమార్థం దక్కించుకోగలుగుతుంది."

"అర్థం పరమార్థం అంటూ మీరిలా నావెంట బడి చీటికీ మాటికీ నమస్కార బాణాలతో సత్కరించుతున్నారు?"

"అబ్బే! మరేం లేదండీ! ఒక విన్నపం!"

"విన్నపమా? అదేమిటి? ఆర్థికమా? శారీరకమా? మానసికమా? కళాత్మకమా? వ్యాపారాత్మకమా? పౌరాణికమా? సాంఘికమా! జానపదమా? సాహిత్యాత్మకమా? శృంగారాత్మకమా? ఏమిటది?"

"భలే! చక్కని కుశల ప్రశ్నలు. "ఛాయిస్"లో ఒకటి ఎంచుకుంటున్నాను."

"ఆర్చేవాడినా? తీర్చేవాడినా?"

"సర్వసమర్థులు!!"

"అశక్తత కూడా అర్హతల్లో ఒకటి!"

"నా విషయంలో మీరశక్తులు కాదు. అపారులు, అనంతులు, కరుణాసముద్రులు!"

"సముద్రానికీ చెలియలి కట్ట వుందిగా!"

"నా కోరిక ఇక చిన్న వానచినుకులోని నీటి తుంపర"

"సరే?...ఏమిటా ఇతివృత్తము?"

"తమ చిత్తము - నా ప్రాప్తము."

"చిత్తమా! భలేవాడివే... అది నా దగ్గర లేదు"

"అవును. తెలుసు. మీ హృదయేశ్వరికి సమర్పించారు."

"ఇకనేం! నీ ప్రాప్తం గురించి ఆలోచించు!"

"మీకు హృదయేశ్వరికి యిచ్చాక. హృదయమే లేకుంటే నా బోటి వాళ్ళకు ఆలోచించుటకు మెదడు వుంటుందా అని?..."

"భేష్!!... నీ మెదడేమయింది!"

"మొద్దుబారింది!!"

"పదునుపట్టు!"

"గురువు దొరకలేదు!"

"వెతుకు!"

"దొరికారు."

"ఎవరు?"

"మీరే!?"

"ఎలా?!"

"మనసు వత్తిడిలేని మెదడున్న మనిషి మీరు. మనస్సు మెదడు పరస్పర విరుద్ధ స్పందనా భాగములు. మీకు ఏకాభిప్రాయమే వుంటుంది. నాబహూ అభిప్రాయ సంఘర్షణకు సంస్కర్త మీ సుస్థిర ఏకైక మస్తిష్కమేగదా!"

"ఆహా!!... ఆహా!!... స్వీకరించాం! విశదీకరించు నీ సమస్యలు!"

అలకించండి!!

నా సమస్య యాంత్రికమూ కాదు తాంత్రికమూ కాదు. మాంత్రిక మసలేకాదు. మీరన్నట్లు ఆర్థిక సాంఘిక సాహిత్య వ్యాయామ, శరీరక, శృంగారాత్మక, జానపద సాంఘిక పౌరాణిక, చారిత్రాత్మకములు... ఇవేవీ కావు!!"

"మరేమిటి?"

"నాకు భయంలేదు, జంకులేదు గొంకులేదు."

"ఇంకా?"

"ఇల్లుకాదు వాకిలికాదు, డబ్బుకాదు. ఇల్లాలు కాదు. పిల్లలుకారు, చెల్లలుకారు భూములు కావు, పుట్టలు కావు"

"చలి, ఆకలి, కోరిక, మంట. నొప్పి, కామ క్రోధమదమాత్సర్యాలు?"

"ఏవీ లేవు!! నాకటువంటివి తటస్థపడినా లెఖ్ఖలేదు!"

"కొంప దీసి...అవన్నీ కావాలా?"

"వద్దు!!... నాకేం ఒద్దు!... ఇహపరాలు కూడా నాకొద్దు. నాకే ఝుంఝూటమూ, ఆడంబరమూ, అధికారమూ, విలాసవైభోగాలూ...

యిపేమీ ఒద్దు!"

"మరేమిటి, మనిషిగా, సాటి మనిషికి మరి నేను చేసేదేమిటి?... ఆయుర్దాయం పొయ్యాలా, వరాలియ్యాలా? ముక్తి ప్రసాదించాలా? ఆలోచించు. ముందేచెప్పాను. నేను కొన్నింటిలో అశక్తుణ్ణని!"

"చిత్తం!... నేనూ ముందే మనవిచేశాను. నా కోరిక అతిస్వల్పమయిన దని!"

"త్వరగా చెప్పయితే."

"మనవి చేస్తున్నాను. మీరు మేరునగ ధీరులు అలుపెరుగరులు. దానకర్ణులు, ధర్మజులు,రసికులు".

"అయితే"

"తమరు పదవి నలంకరించాలి!! మమ్మేల్నాలి!"

"నేను మంత్రినవాలా? నేను యిప్పుడు మంత్రిని కాక కంత్రీనా?"

"మీరింకా పైకి పోవాలి!!"

"స్వర్గానికా?"

"ఇంకా!..."

"అంటే?"

"శ్రీకృష్ణ దేవరాయలంతవాలి! భీముడంతవాలి!"

"నేను చిక్కిపోయానా?"

"అవును. ప్రజల హృదయాల్లో సుస్థిర నాయకుడిగా! నా ఓటు మీరు స్వీకరించాలి! గెలవాలి! పై పైకి పోవాలి! క్రిందికి చూడాలి. మమ్మల్నికనిపెట్టాలి!"

"అంటే చచ్చి దెయ్యమయ్యా?"

"ఎంతమాట!! మీరు చచ్చిపోవటమా? శాంతం పాపం! దెయ్యమవటమా?- హతోస్మి అప్రతిహతం!- అమంగళం అప్రతిహతమగు గాక!!."

"సరి సరి!!- పీ సమస్య??"

"మీ దోమతెర కావాలి!!"

"ఓస్! అంతేనా?"

"అంతేకాదు. మీరాపరేషన్ చేయించు కోవాలి!"

"దేనికి?"

"పిల్లలు పుట్టకుండా!!"

"మరి నా వంశం!?"

"ఒక్కరూ లేక ఇద్దరు చాలునుగా. ప్రజలు మీ బిడ్డలేగా!- మీరు ఆరోగ్యమంత్రి గదా-! నేను తప్ప అందరు ప్రజలూ దోమలు కరిచిచచ్చిపోయారుగా. నేను మిగిలిన మీ బిడ్డను- మీ తదనంతరం మీ ఆస్తి మీ బిడ్డకేగా? మీ బిడ్డ చావకుండా దోమతెర యివ్వండి!!! అదే మహాప్రసాదం- ఈ ఒక్క వారసుడు మిగిలాడు. దోమ తెర కటాక్షించకపోతే- నేనూ హతోస్మి!!-"

"దానికి ఇంత కాకా పటాలా?"

"మరి మీరు, మధ్యలో భేష్ భేష్ అంటూ చప్పట్లు చరుస్తూ చేతులాడించారే!"

"అందుక్కాదు... ఈ సౌండ్ ప్రూఫ్, ఎయిర్ కండిషన్డ్ రూమ్‌లోని దోమల్ని తోలడం అది...!"

"చిత్తం!! - ఇలా కాకా పడుతూ ఈ రాత్రి మీ గదిలో కాస్తలో కాస్సయినా దోమల బాధ నుండి తప్పించుకోవచ్చని ఆశతోవచ్చిననేను... మీ దుస్థితి చూడలేక పోతున్నాను - మీకూ దోమకాటు తప్పనందుకు - బాధపడిగా - సంతోషించనా? - సాటి మనిషిగా సానుభూతి చూపనా?-

"చూపినా మీకు హృదయం లేదు అర్థం చేసుకుందికి!.. అర్థమయ్యేలా చెప్పటానికి నాకు మెదడు లేదు!... దొందూదొందే!'

"ఇక దయచెయ్యి! విప్లవ వీరా! - నీ గోడు కంటే, దోమల రణగొణ ధ్వనే నయం!"

"అలాగే కంత్రివర్యా! - మీ పాలనకంటే నీటి మూగలాలనె సుఖం! వస్తా!..."

* * *

"మీ పాలన కంటే నీటి మూలాలనే సుఖం! సుఖం..."

"ఏమండోయ్!... ఏమిటా కలవరింతలు! ...లేవండి...లేవండి. ఝామెపొద్దెక్కింది..." జానకమ్మ భర్తను లేపింది.

"... ... ..."

"కాఫీగూడ లేదు. పంచదారైపోయింది... నల్ల్బుచిళ్ళ కాకె తుకుపోయింది...బియ్యం నిండుకున్నాయి! కుర్రాడికి స్కూలు జీతం కట్టాలి! ఇంటాయన యింటద్దె అడుగుతున్నాడు... పాలమనిషి, చాకలాడు, మంగలాడు వచ్చికూచున్నారు!...లేవండి! మిమ్మల్నే... ఏం మనిషిరా భగవంతుడా. ఎద్దుమీద వానపడినట్టు ఖాతరే లేదు. అందుకే అన్నారులా వుంది... మేనత్త కొడుకూ...!!"

భర్తకి మేలుకొలుపు పాడింది జానకమ్మ. చిరాకెత్తుకొచ్చింది. అతని ముసుగు లాగి పారేసింది. భర్త వినాయకులు నిద్రలో వుండే దోమలు తోలుతున్నాడు...'కంత్రివర్యా!' అంటూ.

కుర్రవాడు మంచంమీద ఒళ్ళు నొప్పులుతో మూలుగుతున్నాడు. జ్వరంతో ఒళ్ళు తెలియని స్థితిలో వినాయకులు కూతురు మరో మంచాన పడి వుంది.

అది చాలా పాత ఇల్లు. వర్షం వచ్చినా కాదు తుంది. ప్రకృతి దోబూచులాడుతుంది అయింట్లో!

"నాయనోయ్! వినాయకులూ - లేరా!... ఇంకేముందిరా. నా వారసుడు కళ్ళు తేలేశా డ్రోయ్!!!"

అన్న పిడుగుపాటులాంటి మాట విని తుళ్ళిపడి లేచాడు వినాయకులు. అతని తల్లి కుర్రవాణ్ని కిందకి దించేసింది. "ఆఫీసుకు లేటయిపోయింది" అని ఆ ఎల్. డి. సీ అనుకుంటూ లేచేసరికి ఈ అశుభం జరిగిపోయింది.

తలపట్టుకుని కుప్పకూలిపోయాడు వినాయకులు! జానకమ్మ మాతృహృదయం విలవిలా తన్నుకుంటోంది!

మలేరియా వ్యాధి! దోమకాటుతో ప్రారంభమై ఆ పసివాని ప్రాణాలు బలిగొంది.

"దోమతెర" "దోమతెర" అని కలవరించిన వాడికి ఈ గుమస్తా జీతం, జీవితం గురించి ఏమి తెలుసు? ఆరోగ్యమంత్రినే కలలో కలుసుకుని "దోమతెర" మాత్రమే అర్థించిన ఆ పితృ హృదయం - నిస్పృహతోటి అశక్తుడై చివరికిలా తునాతునక అవక తప్పలేదు! ఎప్పుడో తనూ జానకీ ఫేమ్లీ ప్లేనింగ్‌కు కట్టుబడ్డారు!! దోమలు చిల్లులుపడేలా కరిచికరిచి తన వంశాంకురాన్ని పొట్టన పెట్టుకున్నాయి. ఇక ఈ ముదికి పేట మారదు! ఈ దేశం మారదు!!..."

వినాయకులు నిర్వీర్యుడై కొడుకు కట్టెపై పడి వల వలా ఏడవసాగాడు.

ఆ రాత్రికి ఆ శవం బూడిదయింది.

అతని ఆశ్రమ, దీక్ష, ఆశయం, జీవిత దృక్పథం అన్నీ పన్నీరురూపందాల్చి బూడిదలో కలిసిపోయినట్లు అతను పిలయాడు - ఆపోడుడు.

ఆ షాక్ నుంచి నెలరోజులకుగాని తేరుకో లేదతను!

★

